క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. సమావేశానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరవుతారని తెలిపారు.

జిల్లా కార్యవర్గంలో అవకాశం కల్పించాలని వినతి

చండూరు : ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో చండూర్ డివిజన్ నుంచి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతూ సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, అదనపు కార్యదర్శి లక్ష్మిశెట్టి శ్రీనివాస్‌కు చండూర్ రెవెన్యూ డివిజన్‌లోని వివిధ మండలాల ఆర్య వైశ్యులు జిల్లా కేంద్రంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తేలుకుంట్ల జానయ్య, మంచుకొండ సంజయ్, తేలుకుంట్ల శేఖర్, కర్నాటి శ్రీను, తడకమళ్ల శ్రీధర్, మిర్యాల శ్రీనివాస్, గట్టు రాజశేఖర్, తాడిశెట్టి సంతోష్, సోమా నరసింహ, ఉమ శంకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నకిరేకల్ : మంగళపలిల్లో పెరుమాళ్ల వెంకటయ్య ఇటీవల మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబాన్ని బీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

మొక్కల పంపిణీ

చిట్యాల: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో గురువారం ఆ గ్రామస్తులకు ఇంటింటికీ ఆరు మొక్కల చొప్పున చిట్యాల మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎం.సిద్ధి వీరసోమయ్య, డాక్టర్ మాధవి, ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు సరఫరా చేయాలి

నల్లగొండ టౌన్: కాలేజీ హాస్టళ్లలో గ్రంథాలయాలకు బుక్స్ సరఫరా చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బొల్లు రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ హోం.. గ్రీన్ హోం

నల్లగొండ: క్లీన్ హోం.. గ్రీన్ హోం కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లగొండలోని వెంకటరమణ కాలనీలో ప్రోగ్రాం నిర్వాహకులు ఆదిమల్ల మణిరాజు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏలె శోభ, శ్రీనివాస్, చొక్కారం సంతోష్, పగిడిమర్రి అంతయ్య, సరిత, స్వప్న, అనసూయ, అభిలాష్, అక్షిత్, శ్రీనిధి, షాలిని, జాయ్ పాల్గొన్నారు.

ఆలయాలకు విరాళం

చండూరు : మున్సిపల్ కేంద్రంలో మార్కండేశ్వర స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి చండూరుకు చెందిన వట్టికోటి శైలజ కుమారుడు తేజసాయి, కుమార్తె శ్రీజతో కలిసి రూ.20116 విరాళాన్ని ట్రస్ట్ చైర్మన్ కోమటి వీరేశంకు అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు గుర్రం భిక్షమయ్య, ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాసులు, రావిరాల ఓంకారం, చెరుపెల్లి రమేష్, అర్చకులు చెరిపల్లి వెంకటేశం, ఆంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యేల పరామర్శ

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీ నాయకుడు మామిడిపల్లి ప్రశాంత్ తల్లి మాధవి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంభాన్ని గురువారం తుంగతుర్తి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డిలు పరామర్శించారు. మాధవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, బండపల్లి కొమరయ్య, బొడ్డు నగేశ్, పుల్లూరు దేవేందర్ పాల్గొన్నారు.

లక్ష్మయ్యగౌడ్‌కు నివాళి

మర్రిగూడ : ఖుదాబాక్షపల్లి గ్రామంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఏసీపీ నర్సింగ్‌యాదయ్యగౌడ్ తండ్రి లక్ష్మయ్యగౌడ్ మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ గురువారం లక్ష్మయ్యగౌడ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పలువురు ఉపాధ్యాయులు బదిలీ కాగా వారికి గురువారం ఆ పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడు కుర్రె శ్రీనివాస్, బదిలీపై వెళ్తున్న పీఈటీ సంధ్యారాణి, రికార్డు అసిస్టెంట్ ప్రసాద్‌లను ఆ పాఠశాల ఉపాధ్యాయులు, ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఉపాధ్యాయులు అండాలు, షరీఫ్, వెంకట్‌రావు, రాంరెడ్డి, రేణుక, రమణ పాల్గొన్నారు.

ముసురుతో పొంచి ఉన్న ముప్పు

- పంటలకు తెగుళ్లు సోకుతాయని రైతుల ఆందోళన
- సూచనలు పాటించాలంటున్న వ్యవసాయ శాఖ అధికారులు



రాంరెడ్డిపల్లిలో తెగులు సోకిన వరి పొలం

మర్రిగూడ : వారం రోజులుగా మర్రిగూడ మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షం కారణంగా రైతులు సాగు చేసిన పంటలకు కావాల్సిన నీటికంటే అధికంగా అందుతోంది. దీంతో పంటలకు తెగుళ్ల సోకే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పనులు వాయిదా వేసుకుంటున్న రైతులు

మర్రిగూడ మండల వ్యాప్తంగా 25,280 ఎకరాల్లో పత్తి, 1250 ఎకరాల్లో వరి, 78 ఎకరాల్లో జొన్న, 44 ఎకరాల్లో కంది, 100 ఎకరాల్లో రైతులు కూరగాయల సాగు చేపట్టారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు తమ వ్యవసాయ పనులను పూర్తిగా వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం కారణంగా పంటలు తెగుళ్ల బారిన పడతాయోమోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి సలహాలు, సూచలను అందించాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. అదేవిధంగా వర్షాలకు గ్రామాల్లో వీధులన్నీ బురదమయంగా మారాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి చేనులో కలుపు అధికమవుతోంది



ఎనిమిది ఎకరాల పత్తి పంట సాగు చేశా. నిత్యం వర్షం పడుతుండడంతో పత్తి చేనులో కలుపు విపరీతంగా పెరుగుతోంది. కూలీల కొరత ఏర్పడింది. గ్రామాల్లో ఎక్కడ చూసినా బురదమయంగానే ఉంది. ప్రజలు జ్వరాల బారిన పడే పరిస్థితులు ఉన్నాయి.

– దామెర పాపయ్య, రైతు, సరంపేట

ఏఈఓలను సంప్రదించాలి



ప్రస్తుత ముసురుతో పంటలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. ఎక్కడైనా పత్తి చేలో మురుగు నీరు అధికమైతే తొలగించి మెగ్నీషియం సల్ఫేట్‌ను మొక్కలకు అందించాలి. వరి చేలకు ఏ తెగులు సోకదు. ఒకవేళ తెగులు సోకినట్లు అనుమానాలు ఉంటే నేరుగా ఏఈఓలను లేదా ఏఓ కార్యాలయంలో సంప్రదించాలి.

– హేమలత, ఏఓ, మర్రిగూడ

అప్రమత్తత అవసరం

ప్రస్తుత సీజన్‌లో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచకూడదు. కాచి చల్లార్చిన నీటిని తాగితే సీజనల్ వ్యాధులు దరి చేరవు.

– శంకర్, ఆస్పత్రి సూపరింటెండెంట్, మర్రిగూడ

'సాక్షి' కార్యాలయంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సిబ్బంది



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, సాక్షి కార్యాలయ సిబ్బంది

రామగిరి(నల్లగొండ): సాక్షి దినపత్రిక నల్లగొండ యూనిట్ కార్యాలయంలో సిబ్బందికి నల్లగొండ భరత్ హాస్పిటల్, దేవి డెంటల్, న్యూ విజన్ కంటి ఆస్పత్రుల సౌజన్యంతో గురువారం వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని సాక్షి యూనిట్ కార్యాలయ మేనేజర్ రుక్మాధర్, ఎడిషన్ ఇన్‌చార్జ్ జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే సిబ్బంది కోసం యాజమాన్యం ఉచితంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం భరత్ హాస్పిటల్ వైద్యుడు పి.ధరణిధర్, దేవి డెంటల్ హాస్పిటల్ వైద్యుడు గణేశ్ గంజి, న్యూ విజన్ కంటి ఆస్పత్రి ఆప్తమాలజిస్టు ఎండీ.తెహర్ ఆధ్వర్యంలో ఈసీజీ, బీపీ, షుగర్, దంత పరీక్షలతోపాటు కంటి పరీక్షలు చేశారు. కళ్లద్దాలు అవసరమైన వారికి రిఫర్ చేశారు. యాడ్స్ మేనేజర్ జి.వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు



రక్త పరీక్ష చేస్తున్న వైద్యులు

'విద్యారంగంపై వివక్ష చూపుతున్న ప్రభుత్వం'

నల్లగొండ టూటౌన్ : మద్యం ద్వారా ఆదాయం పెంచుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. విద్యారంగంపై వివక్ష చూపిస్తోందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్ విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం పెద్ద గడియారం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వాన్ని గద్దె దింపింది విద్యార్థి ఉద్యమాలేనన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి గట్టిగొర్ల శివకృష్ణ, సంయుక్త కార్యదర్శులు శివ, సాయి, మణికంఠ, మణి, సూర్య, విగ్నేష్, గణేశ్, చందు, ప్రసాద్, వంశీ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్యాల : మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని చిట్యాలలో గురువారం అసోసియేషన్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఏళ్ల బయ్యన్న, జిల్లా సహాయ కార్యదర్శి ముప్ప సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దేవనబోయిన సైదులు, ప్రధాన కార్యదర్శిగా కూరాకుల సుధీర్, కోశాధికారిగా చొప్పరి లింగస్వామి, కుటుంబ భరోసా ఇన్‌చార్జ్‌గా చిలివేరు కృష్ణ, గౌరవ సలహాదారులుగా గాలి యాదగిరి, మెండె నర్సింహ, ఉపాధ్యక్షులుగా బయ్యా రవి, సిలివేరు పరమేష్, పబ్బు సత్తయ్య, శ్రీరామోజు నరేష్, సహాయ కార్యదర్శులుగా మోర అచ్చయ్య, ఎద్దు శేఖర్, గంజి వేణు, ప్రచార కార్యదర్శిగా జిట్ట నరేష్, కార్యవర్గ సభ్యులుగా ఉపేందర్, ప్రణయ్, మల్లేష్‌లు ఎన్నికయ్యారు.

ప్రజల భాగస్వామ్యం ఉండాలి

నల్లగొండ రూరల్ : సహజ వనరుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజనల్ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి అన్నారు. గురువారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వం 1986 నుంచి అనేక చట్టాలను రూపకల్పన చేసిందని, ఉమ్మడి ఏపీలో వాల్టా చట్టం అందులో భాగమని గుర్తు చేశారు. వనరుల పరిరక్షణకు అనేక వ్యవస్థలను ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. భూగర్భ జలాలపై అవగాహన ఉన్న ప్రజలంతా సహజ వనరుల పరిరక్షణలో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విఠల్, సుధీర్‌కుమార్, యాదయ్య, రాణి మొహంత, రేష్మ, రాఘవేంద్ర, గౌతమ్, మధుసూదన్‌రెడ్డి, ఆంజనేయులు, మచ్చేందర్, సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బురద గుంతల తొలగింపునకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్...



విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట నిలిచిన మురికి నీటిలో ఆయిల్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

మునుగోడు: ఇటీవల కురుస్తున్న ముసురుకు మునుగోడులోని వీధులు బురదమయంగా మారాయి. దీనిపై గురువారం సాక్షి దిన పత్రికలో వర్షానికి చిత్తడిమయంగా గ్రామాలు అనే కథనం ప్రచురితమైంది. సాక్షి కథనానికి స్థానిక గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. వీధుల్లో బురద గుంతలను పూర్తిగా తొలగించేందుకు గ్రామ పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా గ్రామ పంచాయతీ సిబ్బంది వర్షపు నీరు జనావాసాల మధ్య లేకుండా చేస్తున్నారు. నీరు నిలిచిన ప్రదేశాల్లో దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ఆయిల్ పోయిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఎల్‌ఈడీ బల్బులు దోహదం

నల్లగొండ: పర్యావరణ పరిరక్షణకు ఎల్‌ఈడీ బల్బులు దోహదపడతాయని జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి అన్నారు. గురువారం నల్లగొండలోని డైట్ కళాశాలలో ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ తయారీపై నిర్వహించిన వర్క్ షాప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో విద్యుత్ వినియోగం తగ్గించే ఆలోచన కల్పించడం ముఖ్యమన్నారు. నిపుణులైన అధ్యాపకులు అవసరమైన ముడిసరుకు విద్యార్థులకు ఇచ్చి వారితోనే ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు తయారీ నేర్పించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.రాజశేఖర్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

చండూరు(గట్టుప్పల్) : కొత్తగా పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని గట్టుప్పల్ ఏఈఓ మౌనిక కోరారు. జూన్ 28 తేదీ లోపు ధరణిలో రిజిస్ట్రేషన్ అయిన వారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జీరాక్స్‌లతోపాటు రైతు బీమా దరఖాస్తు ఫారం నింపి అందజేయాలన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి నామిని మరణించినట్లయితే నామినీ పేరు మార్చుకోవాలని, ఇతర తప్పులు ఏమైనా ఉంటే జూలై 30వ తేదీ లోపు సరిచేసుకోవాలన్నారు.

మత్స్యశాఖ అధికారికి పలువురి శుభాకాంక్షలు

నల్లగొండ టూటౌన్ : మత్స్యశాఖ జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన నర్సింహారావును గురువారం తెలంగాణ మత్స్యకారుల సంక్షేమ సంఘం నాయకులు కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకనబోయిన రమణముదిరాజ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన మత్స్య సంఘాల అడహక్ కమిటీని రద్దు చేయాలని కోరారు. కొర్వి శ్రీనివాస్, పులకరం భిక్షం తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు పండుగ



ఆషాఢ మాసం గోరింటాకు వేడుకలను స్థానిక మహిళలు గురువారం నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరుపుకున్నారు. ఆడపడుచులు అందరూ ఒక దగ్గర కలుసుకుని గోరింటాకు నూరి చేతులకు పెట్టుకున్నారు.

– నకిరేకల్

జ్వర సర్వే పక్కాగా చేయండి



నల్లగొండ టూటౌన్ : మాట్లాడుతున్న కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని కాలనీల్లో ఇంటింటికీ తిరిగి జ్వర, లార్వా సర్వే పక్కాగా చేయాలని జిల్లా మలేరియా అధికారి గంగప్ప, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్పీలు, ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సర్వే చేసే ఇళ్లల్లో జ్వరంతో బాధపడే వారుంటే వారి వివరాలు సమగ్రంగా సేకరించాలన్నారు. లార్వా ఉండే ప్రదేశాలను గుర్తిస్తే వెంటనే శుభ్రపరిచేందుకు మున్సిపల్ సిబ్బంది తక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు. రోజుకు 50 ఇళ్లను, 48 వార్డుల్లో సర్వే చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తం కావాలి

నకిరేకల్ : వర్షాలు కురుస్తున్నందున ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా ముందస్తుగా వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ బాలయ్య కోరారు. నకిరేకల్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆశా కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు పట్టణంలో పర్యటించి ఇళ్ల ఆవరణలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఓగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈఓ రాపోలు రవి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



కేతేపల్లి : మాట్లాడుతున్న గుడుగుంట్ల సాయన్న

చిట్యాల: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేసి అత్యధిక స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు. చిట్యాలలో గురువారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో వర్షిత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం చిట్యాలలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకుగాను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సీకి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. చిట్యాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు కూరెళ్ళ లింగస్వామి, చిట్యాల మండల అధ్యక్షుడు పాట్లపల్లి నర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, రాష్ట్ర కార్యదర్శి మాస శ్రీనివాస్, చిట్యాల పట్టణ ప్రధానకార్యదర్శి గంజి గోవర్ధన్, మండల ప్రధానకార్యదర్శి బొడిగె లక్ష్మయ్య, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కన్నెబోయిన మహాలింగం, జిల్లా అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె వెంకన్నగౌడ్, అంతటి వెంకటేష్, గుండాల నరేష్‌గౌడ్, గరిషె నరేష్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

కేతేపల్లి: కేంద్రంలో బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు ప్రజలకు వివరించి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుడుగుంట్ల సాయన్న అన్నారు. గురువారం కేతేపల్లిలో నిర్వహించిన బీజేపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చినేని జానయ్య, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, ఎ.అనిత, చెరుకు రోషయ్య, ఆర్.శ్రీనివాస్, జి.కృష్ణ, విజయలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

యువమోర్చా ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ



కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

నల్లగొండ టూటౌన్: బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం నల్లగొండలో కార్గిల్ విజయ్ దివస్ కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖి పాల్గొని మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌ను తరిమికొట్టి విజయం సాధించిన రోజుగా కార్గిల్ విజయ్ దివస్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అమరులైన భారత సైనికుల త్యాగాలను కొనియాడి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక సాంబయ్య, రేవెల కిరణ్, అజయ్, బుడుగ భరత్, సాయి, కత్తుల సందీప్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో అధికారుల తనిఖీలు



పెట్రోలు బంక్ తనిఖీ చేస్తున్న అధికారులు

నల్లగొండ: పట్టణంలోని పలు పెట్రోలు బంక్‌లను గురువారం సివిల్ సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. ఆయా పెట్రోలు బంకుల్లో మౌలిక సదుపాయాలు, తాగునీరు, టాయ్‌లెట్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని బంక్ డీలర్లకు సూచించారు. వినియోగదారులతో బంక్ సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, కొలతల్లో తేడా రావొద్దని సూచించారు. ప్రతి బంక్‌లో 10 కేఎల్ పెట్రోల్, డీజిల్ ఎమర్జెన్సీ పర్పస్‌లో నిల్వ ఉంచాలన్నారు. లేకుంటే బంక్‌లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

మంగళపల్లిలో తగ్గుముఖం పట్టిన జ్వరాలు



వైద్యశిబిరాన్ని సందర్శిస్తున్న ఎంపీడీఓ

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామంలో విషజ్వరాల కేసులు తగ్గుముఖం పట్టాయి. గురువారం కూడా గ్రామంలోని ప్రత్యేక వైద్యశిబిరం వద్ద జ్వరాల బారిన పడినవారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం 28 మందిని డాక్టర్ యోగస్విని పరీక్షించగా ఏడుగురికి జ్వరం వచ్చినట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. 16 మందికి రక్త పరీక్షలు చేయగా బచ్చుపల్లి వెంకట్రామ్‌కు చికున్ గున్యా పాజిటివ్ వచ్చిందని హెచ్ఈఓ రాపోలు రవి తెలిపారు. మంగళపల్లిలోని వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ చంద్రశేఖర్ సందర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు గ్రామంలో పర్యటించి తన వంతుగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు గాయాలు

చిట్యాల: పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం రాత్రి రెండు లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు ఐరన్ సీకుల లోడ్‌తో వెళ్తున్న లారీ, నార్కట్‌పల్లి నుంచి భువనగిరి వైపు వెళ్తున్న లారీ చిట్యాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గల జంక్షన్ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐరన్ సీకుల లోడ్‌తో వెళ్తున్న లారీ డ్రైవర్ కాళ్లు విరిగిపోయాయి. ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ఐరన్ సీకులు లారీలోని నుంచి కింద పడిపోవడంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు జేసీబీల సహాయంతో కిందపడిన ఐరన్ సీకులను తిరిగి లారీలోకి ఎక్కించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

'బీజేవైఎం నాయకుల అరెస్ట్ అక్రమం'

కట్టంగూర్ : బీజేపీ, బీజేవైఎం నాయకులను అరెస్ట్ చేయడం అక్రమం అని బీజేపీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు అన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుంటే అసెంబ్లీ ముట్టడిస్తామని బీజేవైఎం నాయకులు ప్రకటించడంతో పోలీసులు ముందస్తుగా గురువారం బీజేవైఎం నాయకులను అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గున్నాల నాగరాజు, కోమటి భాస్కర్, బొడ్డుపల్లి ఆంజనేయులు, ఓరుగంటి హరిబాబు, వెంకన్న ఉన్నారు.

వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో వృత్తిదారుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని చేతి వృత్తిదారుల సమన్వయ సంఘం రాష్ట్ర నాయకుడు బండ శ్రీశైలం ఆరోపించారు. గురువారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 1.83 కోట్ల జనాభా కలిగిన చేనేత కార్మికులు పని లేక అర్ధాకలితో అలమటిస్తున్నారని అన్నారు. చేనేతకు అధిక నిధులు కేటాయించి వృత్తిదారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్, కొండ వెంకన్న, అవిశెట్టి శంకరయ్య, మురారి మోహన్, చెరుకు పెద్దులు, జెల్రిపోతుల ధనుంజయగౌడ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాట

మర్రిగూడ : అజ్జిలాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అమ్మ మాట–అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ ముమ్మడి యశోద పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహ, అంగన్‌వాడీ టీచర్లు రాకొండ శోభ, జయమ్మ, ఆశా వర్కర్ వెంకటమ్మ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

నల్లగొండ రూరల్ : రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు తగిన ప్రాధాన్యత లేదని నిరసిస్తూ బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ ఆధ్వర్యంలో బీసీ నాయకులు గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు యలిజ వెంకటేశ్వర్లు, బోళ్ల నాగరాజు, వనం వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీశైలం, రవీందర్, విజయ్, సాయి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు